విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఎమ్మెల్యే నల్లమిల్లికి మంత్రివర్గంలో స్థానం..?

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి నియోజకవర్గం నుండి విజయం సాధించిన కూటమి బిజెపి అభ్యర్థి ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి రాజకీయ దశ తిరుగనుందా? టిడిపి పార్టీ ఆవిర్భావం నుండి అదే పార్టీలో కొనసాగుతున్న దివంగత నేత నల్లమిల్లి మూలారెడ్డి (కుటుంబం) వారసుడు రామకృష్ణారెడ్డి 2014లో రాజకీయరంగ ప్రవేశం చేసి తొలిసారి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అలుపెరగకుండా కృషి చేయడం జరిగింది.ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా ప్రకటించడం అనంతరం అనేక ఇబ్బందులు ఎదుర్కొని తిరిగి చంద్రబాబు సూచన మేరకే జాతీయ పార్టీ బిజెపి అభ్యర్థిగా పోటీ చేయడం రామకృష్ణారెడ్డికి ఒక రకంగా కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. భారీ మెజార్టీతో బిజెపి అభ్యర్థిగా అనపర్తి నుండి గెలిచిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి బిజెపి కోటాలో మంత్రి పదవి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ప్రచారం ఇప్పుడు జోరుగా సాగుతుంది. ఒకవేళ మంత్రి పదవి దక్కకపోతే డిప్యూటీ స్పీకర్ గా నియమించే అవకాశం ఉందని ఇప్పుడు నియోజకవర్గమంతా చర్చ జోరుగా సాగుతోంది.చంద్రబాబుకి ఎంతో నమ్మకస్తుడైన నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ఈ రెండు కాకపోయినా ఏదో ఒక కేబినెట్ హోదా పదవి మాత్రం ఇవ్వడం ఖాయమనే వార్త చక్కర్లు కొడుతోంది.ఐదేళ్ళుగా ప్రతిపక్షంలో ఉండి ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా అవన్నీ ఎదుర్కొని నిలబడిన నల్లమిల్లికి మంత్రి పదవి దక్కితేనే న్యాయం జరిగినట్లు అవుతుందని కూటమి శ్రేణులు,అభిమానులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ఇది ప్రజా విజయం...

- అధిక మెజార్టీతో నగరంలో చరిత్ర సృష్టించాం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : తమ గెలుపు ప్రజావిజయమని, తమ విజయానంతటికీ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కృషి వల్లే సాధ్యమైందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పేర్కొన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని ఎన్నికల క్యాంపు కార్యాలయంలో ఆయన జనసేన పార్టీ రాజమండ్రి సిటీ ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ, బీజేపీ నగర ఇన్‌ఛార్జ్ యెనుముల రంగబాబు అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించి గతంలో ఎవరికీ రానంత మెజారిటీ తనకు వచ్చిందని, 70 వేలకు పై చిలుకు మెజారిటీ రావడం అనేది చిన్న విషయం కాదన్నారు. అదంతా తన ఘతన కాదని, టీడీపీ, జనసేన, బీజేపీ ఇలా అందరి సహకారంతో సాధ్యపడిరదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు మీడియా సమావేశాల్లో తనను చాలా విమర్శలకు గురి చేశారని, తనకు సీటు రాదన్నారు. సీటు వచ్చింది. తరువాత ఓడిపోతారని వ్యాఖ్యలు చేశారు. 70 వేలు మెజార్టీ వచ్చింది... ఇప్పుడు ఏం మాట్లాడతారు అని వైఎస్సార్‌సీపీ నాయకులు, పేటీఎం బ్యాచ్‌లను ఆదిరెడ్డి శ్రీనివాస్ నిలదీశారు. మేము చేసిన అభివృద్ధే మమ్మల్ని గెలుపిస్తుందన్నారు... మేము నిర్మించుకున్న వ్యవస్థలే మాకు విజయం చేకూరుస్తాయన్నారు... మరి ప్రజలు ఎందుకు తిరస్కరించారో ఆత్మ విమర్శ చేసుకోవాలని వైకాపా వారికి సూచించారు. హేళన చేసిన వైకాపా 11 సీట్లకే పరిమితమై ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితికి చేరుకుందన్నారు. తన భార్య ఆదిరెడ్డి భవానీని అసెంబ్లీలో అవమానించారని గుర్తు చేశారు. తనను, తన భార్య భవానీని సుమారు 2 నెలల పాటు ప్రశాంతంగా నిద్రపోకుండా చేశారన్నారు. తనను, తన కన్న తండ్రిని చాలా ఇబ్బందులకు గురి చేశారని, చాలా ప్రలోభాలకు గురి చేశారని గుర్తు చేశారు. తమ కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ తాము తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతామన్నారు.

ఎంతో అభివృద్ధి చేశా .. నిత్యం ప్రజలతోనే ఉన్నాం...

ఓటమికి కారణం అంతుచిక్కడం లేదు

వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా వ్యాఖ్యలు.



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం, : రాజానగరం నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేనిరీతిలో అభివృద్ధి చేసాం. అర్హులకు పథకాల లబ్ది నేరుగా ఖాతాల్లో జమచేయించాం. అనునిత్యం ప్రజలతో మమేకమై, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నాం. చివరకు కన్నతల్లికి ఒంట్లో బాగోలేక ఆసుపత్రిలో ఉన్నాసరే, పజలకోసం పనిచేశా. అయినా ఇంత దారుణంగా ప్రజలు ఎందుకు ఓడించారో అంతుబట్టడం లేదు" అని జిల్లా వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా వాపోయారు. స్థానిక సంహిత కన్వెన్షన్ హాలులో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో గతంలో చేసిన అభివృద్ధితో పోలిస్తే 20, 30రెట్లు అభివృద్ధి గడిచిన ఐదేళ్లలో చేశామన్నారు.ప్రతి చిన్న ఫిర్యాదుకు స్పందించి జవాబుదారీ తనంతో పని చేశాం. నియోజకవర్గంలో లక్ష కుటుంబాలు ఉంటే 80 వేల కుటుంబాలకు వద్దకు నేనే వెళ్ళాను. నా కుటుంబ సభ్యులంతా ఎన్నో రకాల సహాయ కార్యక్రమాలు నియోజకవర్గంలో నిర్వహించాం. కాపు రిజర్వేషన్ కోసం శ్రమించిన ముద్రగడ లాంటి నాయకుడు అనేక మాటలు పడ్డారు. కాపుల కష్టాలను ఎనాడు పట్టించుకోని నాయకులు హీరోలు అయి పోయారు. గతంలో ఇదే కూటమి అధికారంలో ఉండగా చంద్రబాబు ఇచ్చిన 650 హామీలు నెరవేర్చకపోయినా ప్రజలు ఇప్పుడు అదే కూటమికి పట్టం కట్టారు. మరి హామీలు చూసి ప్రజలు మోసపోయారనుకోవాలా .. ప్రజలకోసం అనునిత్యం తపిస్తూ వారికి మంచి చేయాలని చూడడం మా తప్పా అనేది తెలియడం లేదు. ప్రజల కోసం పట్టించుకోనివాళ్ళు, వేల మెజార్టీతో నెగ్గేసారు.సీఎం పేషీలో ఉన్న ధనుంజయ రెడ్డి లాంటి అధికారుల తీరు కూడా తమను దెబ్బతీసిందని కోరుకొండ దేవాలయ భూముల రీరిజిస్ట్రేషన్ వంటి సమస్యల గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరే సదరు అధికారి పట్టించుకోలేదని జక్కంపూడి రాజా ఆవేదన చెందారు.మంచి మనసుతో ఉన్న జగన్ ఇలాంటి అధికారులను నమ్మడం వలన , వాళ్ళు భ్రమలో ఉంచేశారని ఆయన అన్నారు.మొత్తం మీద ఓటమి కి గల కారణాలన్నీ విశ్లేషించుకుని ప్రజలతో మమేకమవు తామని ఆయన అన్నారు.ఆరునెలలు గడిస్తే ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేస్తుందో ప్రజలే గమనిస్తారన్నారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా నెగ్గినవారికి అభినందనలుతెలిపారు.

నెహ్రూకు పలువురు అభినందనలు

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన జ్యోతుల నెహ్రూను పలువురు అభినందించారు. నియోజకవర్గంలో ఎప్పుడు లేనంత మెజార్టీతో నెహ్రూ గెలుపొందిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం నెహ్రూ కుటుంబ సమేతంగా అన్నవరం వెళ్ళి సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నెహ్రూను జిల్లాలోని పలువురు అభినందించారు. వారిలో ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ ఎన్ సతీష్ రెడ్డి, నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి సత్కరించి అభినందించారు.

నానాజీకి వాసిరెడ్డి సత్కారం

విశాలాంధ్ర - కాకినాడ : రూరల్ ఎమ్మెల్యేగా జనసేన పార్టీ నుండి భారీ మెజారిటీతో గెలుపొంది విజయ దుంకా మ్రోగించిన పంతంనానాజీని వలసపాకల జనసేన పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు నానాజీ గజమాల వేసి ఘనంగా సత్క రించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామదేవు సీతయ్య, అడపా ప్రకాష్ నాయుడు, మాధవరపు తిరుమల రావు, కోమర్తి కోటేశ్వరరావు, వాసిరెడ్డి జ్యోతి వీరకుమార్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల సామగ్రిని సక్రమంగా భద్రపరచాలి

జిల్లా ఎన్నికల అధికారి నివాస్



విశాలాంధ్ర - కాకినాడ : సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో భాగంగా వినియోగించిన ఈవీఎం, వీవీప్యాట్స్, ఇతర ఎన్నికల సామాగ్రిని సక్రమంగా భద్రపరచాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జె నివాస్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కాకినాడ జిల్లాలో సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తికావడంతో అధికారులు ఎన్నికల సామాగ్రిని భద్రపరిచే ప్రక్రియ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం కాకినాడ జేఎన్టీయూలో ఉన్న ఈవీఎంలు, వీవీప్యాట్స్, ఇతర ఎన్నికల సామాగ్రిని ఆయన నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో తరలిస్తున్న ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె నివాస్, జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందర్ రెడ్డి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ పక్కన ఉన్న ఈవీఎం గోదాంలో భద్రపరుస్తున్న ఈవీఎంలు, వీవీప్యాట్‌లను, జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపరుస్తున్న ఇతర ఎన్నికల సామాగ్రిని ఆయన..జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తైన అనంతరం ఎన్నికల సామాగ్రిని జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సురక్షితంగా భద్రపరచడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నికల సామాగ్రి అంతటిని సక్రమంగా భద్రపరచాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్ లను కలెక్టరేట్ పక్కన ఉన్న ఈవీఎం గోదాంలో ఆయా నియోజకవర్గాల వారిగా భద్రపరచాలన్నారు. ఇతర ఎన్నికల సామాగ్రిని జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపరచాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి డా డి తిప్పే నాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూకు మురారి గ్రామస్తుల శుభాకాంక్షలు



విశాలాంధ్ర - గండేపల్లి : ఎన్డీఏ కూటమిలో భాగ స్వా మ్యులైన జగ్గంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటనరసింహంపై 52,775 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించడంతో జ్యోతుల నెహ్రూను మురారి గ్రామస్తులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో బుధవారం వందలాదిమందిగా మురారి గ్రామం నుండి బయలుదేరి జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గంపేట చరిత్రలో ఎన్నడూ రాని విధంగా జ్యోతుల నెహ్రూ భారీ మెజా రిటీ సాధించడంతో టిడిపి అభిమానులు, కార్యకర్తలు సంబరాలు జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో మురారి గ్రామ అధ్యక్షులు సుంకవిల్లి రాజు, గద్దె అబ్బన్న, ఉండవిల్లి బుల్లి రాజు, గ్రామ సర్పంచ్ కుక్కల ఆనంద్ బాబు, పెద్ద ఎత్తున మురారి గ్రామస్తులు పాల్గొన్నారు.

యానాం ఓటర్లకు
పుదుచ్చేరి ఎంపీ అభ్యర్థి వైద్యలింగం కృతజ్ఞతలు

విశాలాంధ్ర - యానాం : పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వైద్యలింగం విజ యానికి సహకరించిన యానాం ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాడి సత్తిబాబు కృత జ్ఞతలు తెలిపారు. స్థానిక ఫెర్రి రోడ్లో ఆయన నివా సంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. యానాం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి యానాం ప్రజలు ఓట్లు వేసి 7003 మెజారిటీతో పుదుచ్చేరిలో ఎంపీ వైద్య లింగం విజయానికి యానాం ప్రజలు మార్గదర్శకం అయ్యారని అన్నారు. ఈ గెలుపు ప్రజా గెలుపుగా తాను భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ యానాంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పుదుచ్చేరి ఎంపీ వైద్య లింగాన్ని యానం తీసుకువచ్చి స్థానికంగా ఉన్న సమస్యలను విన్నవించి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

పురందేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి

విశాలాంధ్ర - కొవ్వూరు : రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా పురందరేశ్వరిని కొవ్వూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొవ్వూరు నియోజక వర్గంలో కూటమి విజయాలపై ఇరువురు చర్చించుకున్నారు. ఎన్నికలలో విజయం సాధించడంపై ఇరువురు ఒకరినొకరు అభినందించుకున్నారు. పురందరిశ్వరుని అభినందించిన వారిలో తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

టీడీపీ శ్రేణుల గెలుపుసంబరాలు

విశాలాంధ్ర - ఆల మూరు : రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సాధించిందని ఇది ప్రజల తీర్పుని ఆలమూరు మండలంలోని పలువురు టిడిపి శ్రేణులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపేట నియో జకవర్గంలో ఇంతవరకు కని విని ఎరుగని మెజార్టీని కూటమి ఎమ్మెల్యే బం డారు సత్యానందరావుకు ప్రజలు కట్టబెట్టారని చరిత్రలో రికార్డు నిలిచి పోతుందన్నారు. అలాగే పార్టీ జెండాలు పట్టుకుని యువత మండల పరిధి లో విజయోత్సవ బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచుకున్నారు. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కు మాజీ ఎమ్మెల్యే వర్మ సత్కారం

విశాలాంధ్ర - గొల్లప్రోలు/పిఠాపురం : మంగళ గిరి జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గ శాసన సభ్యులు కొణిదల పవన్ కళ్యాణ్‌ని పిఠాపురం నియో జకవర్గ మాజీ ఎమ్మెల్యే వర్మ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎస్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పవన్ కళ్యాణ్‌ను వర్మ శాలువాతో సత్కరించి, అన్నవరం సత్యనారాయణ స్వామి వారి దివ్య ప్రసాదం అందజేసి అభినందనలు తెలియజేశారు. తమ గెలుపు కోసం కృషి చేసిన వర్మను పవన్ ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టర్ హిమాన్షుశుక్లా ధన్యవాదాలు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 ప్రక్రియ స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించదానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కలెక్టర్ హిమాన్షు శుక్లా ధన్యవాదాలు తెలిపారు. మార్చి 16వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి జూన్ 6వ తేదీ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను జవాబుదారితనంతో బాధ్యతగా చిత్త శుద్ధితో చేపట్టి ఎన్నికల నిర్వహణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. కోనసీమ జిల్లాలో ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు ముందు రోజు నుండే ఎన్నికల పోలింగ్ సామగ్రిని తరలించడం దగ్గర నుంచి పోలింగ్ విజయవంతంగా పూర్తి చేసుకుని లెక్కింపు ప్రక్రియ పూర్తయిన పిదప ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు చేర్చి భద్రపరిచే వరకు రెండు రోజుల పాటు శ్రమించి తమకు అప్పగించిన బాధ్యతలు విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరికీ అభినందనలు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఎటువంటి అవాంఛ నీయ, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ ను ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి నిరంతరాయంగా రేయింబవళ్లు రక్షణ పరంగా కృషి చేసిన జిల్లా పోలీసు సిబ్బందికి, కేంద్ర సాయుధ బలగాలకు ధన్యవాదాలు. ప్రజా స్వామ్య వ్యవస్థలకు మరింత బలం చేకూర్చేలా ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు విధి విధానాలను రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ప్రజలకు చేరవేయడంతో పాటుగా, క్షేత్రస్థాయిలో ఎన్నికల సంబంధిత సమస్యలను ప్రసారమాధ్యమాల ద్వారా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకుని వచ్చి సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకునేలా సహకరించిన ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు అభినందనలు. కోనసీమ జిల్లా వాసులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కీలకంగా వ్యవహరించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రా నిక్ మీడియా ప్రతినిధులు తమ వంతు సామాజిక బాధ్యత పోషించి జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతా వరణంలో సజావుగా నిర్వహించేలా సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఇది ప్రజలు అందించిన మహా విజయం ...

- అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్

విశాలాంధ్ర - అమలాపురం : అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమం అందాలన్నా ఎన్డీఏ కూటమి ద్వారానే సాధ్యమని ప్రజలు నమ్మి తమను గెలిపించారని, ఇది ప్రజల గెలుపు అని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మెట్ల రమణబాబు నివాసంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాలు వైసిపి పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజలందరికీ సంక్షేమం అందలేదని, ఒక చేత్తో పెట్టడం. ఒక చేత్తో లాక్కోవడం జరిగిందన్నారు.మెట్ల రమణబాబు మాట్లాడుతూ సమస్యలపై ప్రశ్నించేవారిపై అక్రమంగా కేసులు పెట్టడం, దాడులు చేయడం వంటి వాటిని ప్రజలందరూ గమనించారన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించుకోని ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని, ఎక్కడా ప్రజల పక్షాన పని చేయలేదన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చిక్కాల గణేష్, తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా స్వామి, బొర్రా చిట్టిబాబు, ఆశెట్టి అదిబాబు, నల్లా స్వామి, దున్నాల దుర్గ, బొర్రా ఈశ్వరరావు, మాకిరెడ్డి పూర్ణిమ్మ, జనసేన నాయకులు, నల్లా శ్రీధర్, ఏడిద శ్రీను, వలవల శివరావు, పోతుకుర్రు సత్తిబాబు, బత్తుల ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణతోనే జీవరాశుల మనుగడ సాధ్యం



విశాలాంధ్ర - కాకినాడ : ప్రకృతి రక్షణతోనే జీవరాసుల మనుగడ సాధ్యమని జిల్లా అటవీ శాఖ అధికారిణి ఎస్ భరణి పేర్కొన్నారు. కాకినాడ వివేకానంద పార్క్ వద్ద జిల్లా శాఖ గ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జూన్ రెండో తేదీన జిల్లా స్థాయిలో జరిగిన పర్యావరణ పోటీల్లో విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో 183 మంది విద్యార్థులు 154 మంది తల్లితండ్రులు, పర్యావరణ అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అటవీ శాఖ అధికారిని ఎస్ భరణి మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనకి ఎరువులు వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి మనిషి జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాకినాడ ఉపవిద్యాశాఖధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ కృషి చేయాలన్నారు. సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 12 నుంచి నుంచి 19వ తేదీ వరకు ప్రతి పాఠశాలలోనూ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ అధ్వర్యంలో ఇకో- క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎమ్ శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఇస్రో విశ్రాంతి శాస్త్రవేత్త వై.శివ ప్రసాద్ జీవవై విధ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అటవీశాఖ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దాక్యుమెంటరీని ప్రదర్శించారు. ప్రముఖ ఇంద్రజాలకులు జీవశాస్త్ర ఉపాధ్యాయులు వివిఎస్‌వి రమణమూర్తి పర్యావరణ పై చేసిన ఇంద్రజాలం అందర్నీ ఆకట్టుకుంది. ప్రముఖ పప్పెట్రీ శిక్షకులు పిల్లి గోవింద రాజులు మన పర్యావరణం అనే అంశం పైన చేసిన పప్పెట్రి షో అందర్నీ అలరిం చింది. ఈ కార్యక్రమంలో ఇస్రో విశ్రాంతి శాస్త్రవేత్త వై శివప్రసాద్, రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షులు గోపి కాశీవిశ్వనాథ్, కార్యదర్శి అరిగెల బాబి, గ్రంథాలయ అధికారి ములంపాక శ్రీనివాసరావు, జాతీయ బాలల సైనిక్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీని వాసరావు, ఫారెస్ట్‌సెక్షన్ అధికారి నాగార్జున, వైల్డ్ లైఫ్ బయలజిస్ట్ డి మహేష్ బాబు, వీరభద్రరావు పాల్గొన్నారు.

మొక్కలు పెంపకం అలవాటు చేయాలి
-సీడీపీఓ పూర్ణిమ

విశాలాంధ్ర - జగ్గంపేట : బాల్యం నుండి పిల్లలకు మొక్కలు పెంపకం అలవాటు చేయాలని ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ సిడిపిఓ పూర్ణిమ సూచించారు. ప్రతి నెల 5వ తేదిన జరిపే ఇసిసి డేలో భాగంగా బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రాజపూడి, మల్లిశాల గ్రామాల అంగన్వాడి కేంద్రాల్లో కాలుష్య నివారణకు నేను సైతం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ నింగి నుండి వచ్చే ఎండ వేడిని, నేల నుండి వచ్చే నిప్పుల కొలిమి మంటను చల్లార్చేది పచ్చని చెట్లు మాత్రమేనన్నారు. రోజు రోజుకీ తగ్గిపోతున్న ప్రాణ వాయువుని తిరిగి ఇచ్చేవి చెట్లు మాత్రమేనని అంగన్వాడీ కేంద్రాలలో చిన్న చిన్న కిచెన్ గార్డెన్స్ పెంచాలన్నారు. అలా పెంచడం ద్వారా ప్రతి రోజు అంగన్వాడీ కేంద్రాలకు ఉపయోగించే ఆకుకూరలు, కూరగాయలు తాజాగా, రుచిగా ఉంటాయన్నారు. చెట్లు పెరిగితే నీడ నిస్తాయని, బాల్యం నుండే పిల్లలకు మొక్కల పెంపకం అలవాటు చేయాల న్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

భూమి పునరుద్ధరణ పై అవగాహన సదస్సు



విశాలాంధ్ర - కొత్తపేట : ఎస్ఎసిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్-ఫ్యాక్టరీ నందు భూమి పునరుద్ధరణ తదితర అంశాలపై ప్లాంట్ హెడ్-బి. పార్వతీ కుమార్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బ్రాంచ్ సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ అనే నినాదంతో ఫ్యాక్టరీ ఆవరణలో ర్యాలి నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు, భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును అధిగమించడం పై అవగాహన కల్పించారు.

నీట్ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్లో రాజమహేంద్రవరంలో తమ తిరుమల ఐఐటి , మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. పి. బేబి అబిజ్ఞ 720 మార్కులకు 715 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 27వ ర్యాంకును, పి. శివ సంపత్ నాయుడు 720 మార్కులకు 715మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 46వ ర్యాంకును, ఎన్. రాధా కృష్ణ 720 మార్కులకు, 710 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 116వ ర్యాంకును, ఇ. లోహిత్ కుమార్ 122వ ర్యాంకును, ఎన్. అనుదీప్ 217వ ర్యాంకును, ఆర్. లహరి 435వ ర్యాంకును, ఎ. హరితేజ 510వ ర్యాంకును, యస్. హేమంత్ 557వ ర్యాంకును, జి. ఓంకార్ 670వ ర్యాంకును, వి. రామకృష్ణా రెడ్డి 991వ ర్యాంకును, యస్. సాకేత్ రాఘవ్ 1004వ ర్యాంకును వివిధ కేటగిరీలలో కైవసం చేసుకున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో మా అత్యుత్తమ ర్యాంకులు 27, 46, 116, 122,217, 435, 510, 557, 670, 991, 1004.... సాధించారని, 1000 లోపు 10 మంది, 5000 లోపు 46 మంది,10000 లోపు 89 మంది, 20000 లోపు 162 మంది, 30000 లోపు 212 మంది ర్యాంకులు సాధించారని, 240 మంది పైన విద్యార్థులు సీట్లు సాధించగలరని ఆయన తెలియజేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి. శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

నేడు,రేపు బస్ పాస్ కేంద్రం మూసివేత
ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ షాబాన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు,ఉద్యోగులు కోసం ప్రతి నెల అందించే బస్ బస్సుపాసుల సాఫ్ట్ వేర్ నవీకరణలో భాగంగా ఈ నెల 6,7 తేదీల్లో మూసివేస్తున్న మని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ ఆర్టీసీ)రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షాబాన అన్నారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటనను బుదవారం విడుదల చేశారు.దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారు లు ఆదేశాలు మేరకు తమ డిపోలో ప్రతినెల ఇస్తున్న బస్ పాస్ కేంద్రం సాఫ్ట్వేర్ నవీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 6,7 రెండు రోజుల పాటు బస్ పాస్ కౌంటర్ మూసివేస్తున్నమని, తిరిగి జూన్ 8వ తేదీ నుండి యదావిధిగా బస్ పాస్ సేవలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.రాజమహేంద్రవరం డిపో పరిధిలో ప్రయాణించే విద్యార్థులు,సీజన్ టిక్కెట్లు తీసుకొనే వారు ,మంత్ల సీజన్ టికెట్లు కొనుగోలు చేసే ప్రయాణికులు, ప్రత్యేక ప్రతిభావంతులతో పాటు ప్రతిఒక్కరు తమకు సహకరించాలని కోరారు. బస్ పాస్ నిమిత్తం కేంద్రాన్ని కి ఈ నెల 6,7 తేదీల్లో ఎవరు రావద్దని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణం పై అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : పర్యావరణంపై అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారులు ప్రోజెక్టులు చేశారు. ప్రతి నెల 5వ తేదిన అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిసి డే నిర్వహిస్తారు. దానిలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిర్లంపూడి మండలంలోని చిల్లంగి గ్రామ అంగన్వాడి కేంద్రంలో కార్యకర్త చిన్నారులచే పర్యావరణంపై పలు కార్యక్రమాలను నిర్వహించారు. ప్రోజెక్టులు చేయించడంతో ఐసీడీఎస్ జగ్గంపేట ప్రోజెక్ట్ సిడిపిఓ పూర్ణిమ సందర్శించి చిన్నారులను, కార్యకర్తలను అభినందించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణపై చిన్నారులకు అవగహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం జలమయం

విశాలాంధ్ర - కరప : కరపలో కురిసిన భారీ వర్షానికి బుధవారం మండల పరిషత్ కార్యాలయం జలమయమైంది. నీరు పోయే మార్గం లేకపోవడంతో మండల పరిషత్‌లో పని చేస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై అధికారులు చర్యలు తీసుకోవడంలో శూన్యం అనే చెప్పాలి. చినుకు పడితే చాలు మండల పరిషత్ కార్యాలయానికి వరద నీరు వచ్చి చేరుతుందన్న చందంగా వాగును తలపిస్తుంది. వర్షాకాలంలో ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాలంటే తమ బట్టలను తడుపుకోవలసి వస్తుంన్నారు. దీనిపై అధికారులు స్పందించి నీరు పోయే మార్గం చూపించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర - కామవరపుకోట : ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలనే తలంపుతో మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సంపాదించిన విద్యార్థులకు రామన్నపాలెం గ్రామానికి చెందిన చైనాలో ఉండే సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్ బోడావిజయ్ బ్రదర్ స్ఫూర్తితో, ఆర్థిక సహాయంతో ప్రోత్సాహక పారితోషకం, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారు. జూన్ 7వ తేదీ అభినందన కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కామవరపుకోట హై స్కూల్లో అభినందించనున్నారు.

విద్యార్థులు చదవడం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - కలిదిండి: పుస్తకాలు చదవడం అలవర్చుకున్న విద్యార్థులకు అవి చిరకాలం స్నేహితునిగా వెంట వస్తాయని, శాఖ గ్రంథాలయ అధికారి జే. రమేష్ బాబు అన్నారు. బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వలన వ్యక్తిత్వ వికాసం, శారీరక, మానసిక పరిపక్వత ఎదుగుదలలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని తెలిపారు. పుస్తకాలు చదవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం విద్యార్థులచే పుస్తక పఠనం, పుస్తక సమీక్ష , చిత్రలేఖనం, స్నేక్ అండ్ లాడర్, లూడో , చెస్ ఆటలను నిర్వహించారు.

ఆవుకు భజరంగ్ దళ్ సేవలు

విశాలాంధ్ర-నరసాపురం : హిందువులు ఆవును ఆరాధ్య దైవంగా భావించడమే గాకుండా సాంప్రదాయకంగా పూజిస్తారు. కడుపుతో ఉన్న ఆవుకు భజరంగ్ దళ్ సభ్యులు సకల ఉపచారాలు చేశారు. ఆవు కష్టం చూసిన సభ్యులు చలించి పోయారు. ఆవు కాన్పుకు స్థానికులు సహకారాలు అందించారు. స్థానిక పశు వైద్య శాల కు చెందిన వెటర్నరీ డాక్టర్ సాయి వైద్య సేవలు అందించారు. వైద్య సేవలు అందుకున్న ఆవు పెయ్యికి జన్మను ఇచ్చింది. పట్టణం లోని అధికార వారి వీధిలో జరిగిన ఈ ఘటనలో నర్సాపురం బజరంగధల్ కు చెందిన సభ్యులు, కూన నరేంద్ర, కునరాజా, తదితరులు సహాయ సహకారాలు అందించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - పెంటపాడు : పెంటపాడు ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నారపాటి రాజేష్ అధ్యక్షతన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాస్, టీవీ రామకృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక మొక్క నాటి పెంచాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం, ప్లాస్టిక్ సంచుల బదులు నార సంచులు ఉపయోగించటం, మురికి నీరు నిలవ ఉండకుండా ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించగలుగు తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిబి స్కూల్ ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పుర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించిన పుర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు అని టిడిపి ఎస్.సి.సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృతజ్ఞతలు జాలా బాలాజీ అన్నారు. బుధవారం టిడిపి ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)ను ఆయన క్యాంపు కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో బడేటి చంటిని 62,388 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించడమే కాకుండా, 3వ డివిజన్ లో 1323 ఓట్ల మెజారిటీ అందించినందుకు ఆ డివిజన్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బడేటి చంటిని కలిసిన వారిలో టిడిపి 3 డివిజన్ అధ్యక్షులు చనపతి వెంకటరమణ,కార్యదర్శి జా లా శివశంకర్, వీరబత్తిన రత్తయ్య, వనిత, కమిటీ సీనియర్ నాయకులు దాలి త్రిమూర్తులు తదితరులున్నారు.



మొక్కలు నాటి భావితరాలకు అందించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం ను ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దూలం నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మొక్కలను నాటారు. అందరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి భావితరాలకు అందించాలని కోరారు. గ్రౌండ్ లో వాకర్స్ తో కలిసి మొక్కలు నాటండి, పర్యావరణాన్ని రక్షించండి, సేవ్ ప్లాంట్స్ అంటూ నినాదం చేస్తూ కాసేపు గ్రౌండ్లో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కోశాధికారి మల్లారెడ్డి సారధి,డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, ఏ. ఆర్. కె. సత్యనారాయణ మూర్తి, సుధాకర్, డాక్టర్ కంచర్ల, మాజీ పోలీసు అధికారి వెంకటేశ్వరరావు, వెంకట్రావు పెద్ద సంఖ్యలో వాకర్స్ సభ్యులు, మార్నింగ్ వాకింగ్ చేసే యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



చిట్టితల్లి ఆలయంలో పూజలు

విశాలాంధ్ర-నరసాపురం: ఎన్డీఏ కూటమి విజయదుందుభి మ్రోగించిన సందర్భంగా నరసాపురంలో వేంచేసి ఉన్న చిట్టితల్లి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, వనితాక్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ డా. రాజ్యలక్ష్మి శిరిగినీడి పూజలు నిర్వహించి చంద్రన్న, పవనన్న చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా మహిళా కమిటీ మరియు వనితా క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ కు చంద్రబాబు, పవన్ రూపంలో మంచి రోజులు వచ్చాయన్నారు. ఇంతటి సునామీని సృష్టించి ఒక అసాధారణ విజయానికి నాంది పలికిన రాష్ట్ర ప్రజలందరికి డాక్టర్ రాజ్యలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అందరికీ స్వీట్స్ పంచి పెట్టారు.

భూతాపంతో పర్యావరణానికి ముప్పు

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణ పరిధిలో క్రమశిక్షణ కలిగిన ప్రభుత్వ పాఠశాల గా పేరుగాంచిన పాలకొల్లు జి.వి.ఎస్.వి.ఆర్.ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకొల్లు మండల విద్యాశాఖ అధికారి గుమ్మళ్ళ వీరాస్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణంపై ప్రభావం చూపుతున్న పారిశ్రామిక కాలుష్య వ్యర్థాలను నియంత్రించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. ప్రజలు మొక్కలను పెంచడం ఒక వ్యాపకంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ మాట్లాడుతూ భూమి ఉమ్మడి ఆస్థి. దీన్ని అందరూ కలిసి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా మొక్కల సంరక్షణకు అవసరమైన ఐరన్ మెస్‌ను ఏర్పాటు చేసేందుకు, పట్టణ ప్రముఖ కాంట్రాక్టర్, దాత, మారెళ్ళ మాణిక్యాలరావు రూ.6వేలను ప్రధానోపాధ్యాయులు భవాని ప్రసాద్‌కు వితరణగా అందజేశారు. రాయపూడి ఈ మొత్తాన్ని స్కూలుకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల నాగేశ్వరరావు, మారెళ్ల శ్రీనివాసరావు. తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు మంచిరోజులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆంధ్ర రాష్ట్రంలో గ్రహణం వీడిందని, రాష్ట్ర ప్రజలందరికీ మంచి రోజులు వచ్చాయని చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు పారేపల్లి రామారావు పేర్కొన్నారు. మండలంలో బయ్యనగూడెం గ్రామంలో ఆయన నివాసంలో ఆయనను మండలంలో పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ, చింతలపూడి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్ట మహేష్ కుమార్ అత్యధిక వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఆనందదాయకంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, ఎంపీటీసీ కాగితాల గణపతి, సుధగాని సత్యనారాయణ, మల్లవరపు త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

చిర్రి బాలరాజుకు సత్కారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గం నుండి కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు విజయానికి కృషి చేసిన నియోజకవర్గ నాయకులకు, కార్యకర్త లకు, అభినందనలు అని బయ్యనగూడెం గ్రామ కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. బయ్యన్నగూడెం గ్రామంలో నాయకులందరినీ ఒకే తాటిపై తీసుకు వచ్చి, కూటమి అభ్యర్థి విజయం సాధించడానికి కృషి చేసిన మద్దు బాల నాగేశ్వరరావు, మద్దు తేజ విశ్వనాథ్ ల ను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలం నరేష్,కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సంబరాలు

విశాలాంధ్ర -భీమవరం: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ జగన్ తన అరాచక పాలనతో హింస కక్ష రాజకీయాలు చేయడంతో రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టం కట్టారని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అన్నారు. ఎన్డీఏ గెలుపు సంబరాలను టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలో పులపర్తి రామాంజనేయులు కూటమి గెలుపుతో కార్యకర్తలు, నాయకులలో నూతన ఉత్సాహం నెలకొందని కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు, కార్యకర్తలకు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడానికి వచ్చిన జగన్ పాలనలో దాడులు దారుణాలు హత్యా రాజకీయాలు చూసామని రానున్న రోజులలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని శరవేగంతో అభివృద్ధి చేయనున్నారని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకుడు మద్దుల రాము మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అఖండ విజయానికి సహకరించిన రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి రాష్ట్ర కార్యదర్శిలు కోళ్ళ నాగేశ్వరరావు వెంద్ర శ్రీనివాస్ మరియు కుటమి మిత్రనాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, నాయకులు గనిరెడ్డి త్రినాథ్ గునుపూటి తిరుపాల్, ఎద్దు ఏసుపాదం, ఎండి నౌషాద్, మైలాబత్తుల ఐజాక్ బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

నా విజయం మీ అందరిది

విశాలాంధ్ర -భీమవరం: నరసాపురం పార్లమెంట్‌లో ప్రతి సమస్యపై అవగాహన ఉందని, ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నరసాపురం పార్లమెంట్ సభ్యులు భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. భీమవరం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 34 ఏళ్ల బిజెపి ప్రయాణంలో గానీ అంతకు ముందు విద్యార్థి సంఘాల్లో గానీ ఆనాటి నుంచి నేటి వరకు అందరూ అందించిన సహకారం మరువలేనని అన్నారు. మీ సహకారంతోనే విజయం సాధించానని, పార్టీ నాయకుడిగా ఉన్న నేడు ప్రజా ప్రతినిధిగా ఎన్నికైనని, బాధ్యతను ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేస్తానని, నరసాపురం పార్లమెంట్ లో ఎన్నాడు లేని విధంగా ప్రజలు 2 లక్షల 76 మెజార్టీని అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని, జిల్లాలోని 7 నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలతో కలసి సమన్వయం చేసుకుని నరసాపురం పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. బిజెపి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ మాట్లాడుతూ అనేక వివాదాల మధ్య పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీనివాస వర్మకు అఖండ విజయాన్ని అందించారని, అభ్యర్థి, పార్టీ పట్ల నిబద్ధత ఉందని, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త విశేషంగా కృషి చేశారని, అందరికీ ధన్యవాదములు తెలియజేస్తున్నామని, 2 లక్షల మెజార్టీతో ప్రజలు ఆశీర్వదించారని అన్నారు. కార్యక్రమంలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు, పేరిచర్ల సుభాష్ వర్మ, కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించాలి

విశాలాంధ్ర -భీమవరం: విద్యార్థి దశ నుండి పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కలిగి ,పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని పాలిథిన్ కవర్స్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణం పరిరక్షణ పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. జె.శ్యామ్ విద్యార్థులకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ షేక్ బాబాజీ, ఆప్ కాస్ట్ జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీను, చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం, బి.జిగ్నేష్ పుట్టినరోజు సందర్భం గా విద్యార్థులకు కేక్ కట్ చేసి స్వీట్స్ అందచేశారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు ,సిబ్బంది వి.సోమరాజు, పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

విశాలాంధ్ర - పెంటపాడు : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ,తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో జనసేన భారీ ఆధిక్యతతో గెలుపొందడంపై మండలంలోని ఉమామహేశ్వరం గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ 135 స్థానాలను, జనసేన పార్టీ 21కి 21 స్థానాలను సొంతం చేసుకోవడంతో గ్రామానికి చెందిన రాష్ట్ర తెలుగు మహిళ నాయకురాలు కొండ్రెడ్డి హైమావతి, మాజీ సర్పంచ్ మద్దుకురి రామకృష్ణ, మూసిన రాంబాబు నేతృత్వంలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం పూర్తి ఫలితాలు వెలువడిన వెంటనే గ్రామంలో టపాశులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. గ్రామమంతా ప్రదర్శన నిర్వహించారు. జై ఎన్టీఆర్, జై జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్ అనే నినాదాలు గ్రామంలో మారు మ్రోగాయి. స్థానిక బీసీ కాలనీలో యువకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమిని ప్రజలు ఆశీర్వదించారన్నారు. రాష్ట్రం అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలు, అమరావతి రాజధాని నిర్మాణం తదితర అంశాలపై ప్రజలు ఏకపక్షాన తీర్పును ఇచ్చారన్నారు. రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధించాలంటే పూర్తి అనుభవజ్ఞుడు చంద్రబాబుతోనే సాధ్యం అని అన్నారు. యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల స్థాపన కూటమి ద్వార సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మరిపూడి సుబ్బారావు, తాడేపల్లి కాట్రాజు, వెలగలేటి వెంకటేశులు, గోలి లక్ష్మి, తమ్మిశెట్టి శివ, గోలి ప్రకాష్, సిరపు మల్లయ్య, బండారు నరేష్, గోలి పెద్దిరాజు, బండారు నరసింహమూర్తి, మద్దుకూరి వెంకట సుబ్బారావు, రత్తయ్య, రాము, అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గ జనసేన పార్టీ శాసనసభ అభ్యర్థిగా చిర్రి బాలరాజును నియోజకవర్గ ప్రజలంతా గెలిపించడం హర్షించదగ్గ విషయం అని కొయ్యలగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గంలో కొయ్యలగూడెం మండల ప్రజలు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి చిర్రి బాలరాజు ను అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతో పాటు నైపుణ్యాలను వెలికితీయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యతో పాటు నైపుణ్యంలో తనకు ఉన్న ప్రతిభను వెలికితియాలని గ్రేడ్ 1 గ్రంథాలయ అధికారి జె. ప్రభుదాసు అన్నారు. పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుల ఉత్తర్వుల మేరకు గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో విద్యార్థులకు బుధవారం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు పుస్తక పఠనం, భగవత్ గీతా, చిత్రలేఖనం, కథలు చెప్పడం, చదవడం, తెలుగు పద్యాలు, పాటలు పాడటం వాటిలో శిక్షణ ఇచ్చి చిత్రలేఖనం పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితియ, తృతీయ బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో భగవత్ గీత టీచర్ ఎం. శేషగిరిరావు, తెలుగు ఉపాధ్యాయులు సి హెచ్ అయ్యప్ప, ఇంగ్లీష్ అధ్యాపకులు కె. శ్రీకాంత్, గ్రంధాలయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, డిఎస్సి అభ్యర్థులు, పాఠకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండలికి భారీ మెజారిటీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ శాసన సభ స్థానాన్ని జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ భారీ మెజారిటీతో కైవశం చేసుకున్నారు. ప్రత్యర్థి అభ్యర్థి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి సిట్టింగ్ ఎం.ఎల్.ఎ సింహాద్రి రమేష్ బాబుపై బుద్ధప్రసాద్ 46,434 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. గడిచిన 70 సంవత్సరాలుగా నియోజకవర్గంలో ఎవరూ సాధించలేని భారీ మెజారిటీని మండలి బుద్ధప్రసాద్ సాధించి అవనిగడ్డ రాజకీయ చరిత్రలో ఒక కలికితురాయిగా నిలిచారు. గత నెల 13 వ తేదిన జరిగిన ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం 1,86,465 ఓట్లు పోలవ్వగా కూటమి జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌కు 1,13,460 ఓట్లు రాగా, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబుకు 67,026 ఓట్లు లభించాయి. దీంతో 46,434 ఓట్లు మేజారిటీతో గెలుపొందినట్లు ఆర్.ఓ బాలసుబ్రహ్మణ్యం ప్రకటించి సుబ్రహ్మణ్యం మండలి బుద్ధప్రసాద్‌కు గెలుపు ధృవీకరణపత్రం అందచేశారు. 13వ తేదిన జరిగిన ఎన్నికల్లో మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ పడగా మూడవ స్థానంలో నోటాకు 1952 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందె శ్రీరామమూర్తికి 1068 ఓట్లు రాగా, ఇండిపెండెట్ అభ్యర్థి బోయిన బుద్ధప్రసాద్‌కు 689 ఓట్లు, బిఎస్‌పి అభ్యర్థి గుంటూరు నాగేశ్వరరావుకు 436, జై భీమ్ పార్టీ అభ్యర్థి సముద్రాల అంబేద్కర్‌కు 420, ముంగల వెంకట నాంచారయ్యకు 345, వెంట్రాప్రగడ ఆనంద్ కుమార్‌కు 313, నీలా మనోహర్ బాబుకు 27, తానంకి చంటికి 190, మత్తి పుష్పకుమార్ 184, నాదెళ్ళ గిరిధర్ నాయుడుకు 125 ఓట్లు వచ్చాయి. విషయం ఏమిటంటే వైయస్ఆర్‌సిపి అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు సొంత గ్రామం అయిన బందలాయిచెరువులో జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌కు 574 ఓట్లు రాగా, సింహాద్రి రమేష్ బాబుకు 342 ఓట్లు రావంతో సొంత గ్రామంలోనే మెజారిటీ కోల్పోయిన సింహాద్రి రమేష్ బాబు బందలాయి చెరువులో మండలి బుద్ధప్రసాద్‌కు 232 ఓట్లు అపూర్వ మెజారిటీ ఆ గ్రామ ప్రజలు ఇచ్చారు.

నేడు, రేపు బస్సు పాస్ కౌంటర్లు పనిచేయవు

విశాలాంధ్ర అవనిగడ్డ : ఎపిఎస్ఆర్‌టిసి బస్సు పాస్ కౌంటర్లు ఈ నెల 6 వ తేది గురువారం, 7 వ తేది శుక్రవారాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్ఆర్‌టిసి బస్సు పాస్‌లకు సంబంధించి కొత్త సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి పరుస్తున్న కారణంగా రెండు రోజుల పాటు బస్సు కౌంటర్లకు సెలవు ప్రకటించినట్లు ఈ విషయాన్ని ఆర్‌టిసి బస్సు పాస్ దారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - విజయవాడ(చిట్టినగర్): ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాల అండ్ ప్రేరణాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం మోంట్ ఫోర్ట్ ఎన్విరాన్మెంటల్ హబ్ నందు జరిగిన సదస్సు లో నూజివీడు సెయింట్ థామస్ విద్యార్థులు, సిస్టర్స్ పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు. 21వ శతాబ్దంలో నీరు, గాలి, భూమిని పరిరక్షిస్తూ వాటి ఫలాలను రానున్న భావితరాలకు అందించాలని వక్తలు ప్రసంగించారు. లయోలా కళాశాల విద్యార్థులు వాతావరణం పై పురుగుమందుల ప్రభావం, అడవులను పరిరక్షించుట, ప్లాస్టిక్ రహిత సమాజం, మొదలగు అంశాలపై ప్రదర్శనలిచ్చారు. కళాశాల అధ్యాపకులు సిస్టర్ డాక్టర్ క్యాండీ, ప్రొఫెసర్ ఎం విజయ్ కుమార్, హెచ్ ఓ డి వి నాగలక్ష్మి పర్యావరణ దినోత్సవ నేపథ్యంపై ప్రసంగించారు. అనంతరం మౌంట్ ఫోర్ట్ ఎన్విరాన్మెంటల్ హబ్ ప్రాంగణంలో విత్తనాలు వేసి, మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపల్ ఓ మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బాలస్వామి వీరు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజాన్ని మేల్కొల్పాలని అధ్యాపకులను కోరారు. లయోలా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్, కార్యదర్శి ఫాదర్ జోజి రెడ్డి విద్యార్థులను, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు, స్థానికులు పాల్గొన్నారు.

పామర్రు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ అందించిన మొవ్వ మండలం

విశాలాంధ్ర-కూచిపూడి : గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పామర్రు నియోజకవర్గంలో ఎన్డిఏ అభ్యర్థి వర్ల కుమార్ రాజా 17 రౌండ్లలో 29 ,134 ఓట్లు మెజార్టీ సాధించి విజేతగా నిలిచి పసుపు జెండాను ఎగరవేసి రికార్డు సృష్టించారు.. అలాగే పోస్టల్ బ్యాలెట్ లో సైతం 556 ఓట్లు మెజార్టీ సాధించారు. కుమార్ రాజాకు 92853 ఓట్లు రాగా, వైయస్సార్సీపి తరఫున పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ 63719 ఓట్లు సాధించుకున్నారు. అదేవిధంగా ఎన్డీఏ అభ్యర్థికి పోస్టల్ బ్యాలెట్ లో 1336 వైసీపీ అభ్యర్థికి 780 ఓట్లు లభించాయి. నియోజకవర్గం 17 రౌండ్లలో ప్రతి రౌండ్ కుమార్ రాజా తన ఆధిక్యతను చాటుకున్నారు. నియోజకవర్గంలో పెదపారుపూడి, పామర్రు, మొవ్వ, పమిడిముక్కల తోట్లవల్లూరు మండలాలు ఉన్నాయి కుమార్ రాజా కి లభించిన మెజార్టీలో మొవ్వ మండలం నుంచి 5721 ఓట్లు మెజార్టీ లభించాయి. మొవ్వ మండలంలో ఒకప్పుడు కాంగ్రెస్.కు, ప్రస్తుతం వైఎస్సార్సీపీకి మెజార్టీ ఇచ్చిన గ్రామాల్లో సైతం టిడిపి మెజార్టీ సాధించింది. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సంక్షేమ పథకాలు, ఎన్నారై ఓట్లు, తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలు కలసి ఉమ్మడిగా పోటీ చేయటం ఒక ఎత్తైతే శిధిలమైనన రహదారులు, మురుగు పంట, కాలవలపై నిర్లక్ష్యం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలుపై దృష్టి పెట్టడం లాంటిసమస్యలువైసీపీకి శాపంగా పరిణమించి షాక్ ఇచ్చాయన్నదిబహిరంగ రహస్యం. గ్రామాల వారీగా పోవ మండలంలో వచ్చిన ఓట్ల వివరాలు ఇవే.. భట్ల పెనుమర్రులో తెలుగుదేశంకు1390, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 745 ఓట్లు వచ్చాయి. అలాగే కూచిపూడి లో 1452 టిడిపికి రాగా, వైసీపీ వైసీపీకి 934 వచ్చాయి. బార్లపూడిలో 240-191, పెదసనగల్లులో 1426-905, అయ్యంకిలో 12 36-836, చినముత్తేవిలో 10 53-657, పెదపూడిలో 14 47-747, అవురుపూడిలో 499-326, పాలంకిపాడులో 266-172, నిడుమోలులో 1251-1141, మంత్రి పాలెం లో 935-525, యద్దనపూడి లో 480-285, మొవ్వ లో 1549 -1418, గూడపాడులో 466-228, మొవ్వ పాలెంలో 398-181, కొండవరంలో 279-223, పెదముత్తేవిలో 10 65-778, వేములమడలో 714-442, కోసూరులో 2176 -1404 ఓట్లు టిడిపికి వైసీపీకిలభించాయి. కాజలో తెలుగుదేశంకు 2899 వైయస్సార్సీపీకి 1829, పద్దా రాయుడు తోటలో తెలుగుదేశం పార్టీకి 648, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 205 ఓట్లు లభించాయి.

పెన్నులు, చీరలు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మండల కేంద్రమైన మొవ్వలో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి దేవినేని వెంకటరమణ దంపతుల 25వ వర్థంతి వేడుకలను వెంకటరమణ యూత్ వ్యవస్థాపకులు పోతార్లంకరాము(ఫోటోగ్రాఫర్) నాయకత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర దేవినేని వెంకటరమణదంపతుల ఫోటోలుకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మండవ రత్నగిరి రావు, మండవ కోటేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, సంకుల కోటేశ్వరరావు, మండవ పిచ్చేశ్వరరావు, కొడాలి రామకృష్ణ, జొన్నలగడ్డ రాజేశ్వరరావు, మండవ వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.

మత్తు వీడని బందరు పోలీసులు

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : సార్వత్రికఎన్నికలలెక్కింపు సందర్భంగాఈ నెల4వ తేదీన మాజీఎమ్మెల్యే పేర్నినాని ఇంటివద్ద గొడవజరిగిందని రామానాయుడు పేటలో రాష్ట్రజాతీయరహదారిపై బారికేడ్లుఏర్పాటుచేసినపోలీసులు, 24 గంటలుగడిచిన,వాటిని తీయకపోవడం ప్రజాజీవనానికి భంగంకలిగించడమేఅని, మనం ప్రజాస్వామ్యంలోఉన్నామా? నియంతృత్వంలోఉన్నామా? అన్న విషయం అర్థంకావడంలేదని ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలనుండి కాలేజీలకివచ్చువిద్యార్థిని విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సివస్తుందని, పోలీసులు ఇప్పటికైనా బ్యారికేడ్లనుతొలగించి సాధారణ పౌరజీవనం కల్పించేలా చూడాలని కోరుతున్నారు. వాస్తవానికిపేర్నినాని ఇంటికి అనేక దారులుఉన్నాయి. వాటిని అన్నింటినీ మూయకుండా జాతీయ రహదారిని దిగ్బంధనం చేయటమంటే ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించడమే అవుతుంది. ఒకవేళ లాఅండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తుందనుకుంటే నాని కుటుంబాన్ని హౌస్ అరెస్ట్ చేసి పోలీసులు రక్షణకల్పించాలి గాని ప్రజలను ఇబ్బందిపెట్టడం మంచి పనికాదు అని వ్యాఖ్యానిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే? బ్యారికేడ్లు ఏర్పాటుచేశారు, కనుచూపుమేరలో చూద్దామన్నా ఒక కానిస్టేబుల్ కూడా కనిపించకపోవడంపై పోలీసులు నిద్రలో ఉన్నారని ఇంకా వైకాపా ప్రభుత్వం ఉందనే భ్రమలో ఉన్నారని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

భారతీయ తెలుగు విద్యార్థికి ప్రతిష్టాత్మకమైన అమెరికా ప్రెసిడెన్షియల్ అవార్డు

విశాలాంధ్ర-మచిలీపట్నం : డల్లాస్ నగరంలోని మిలీషియా ప్రాంతంలో విల్లో వుడ్ ఎలిమెంటరీ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న తెలుగు తేజం హర్షిత్ కు ప్రతిష్టాత్మకమైన అమెరికా ప్రెసిడెంట్ అవార్డు లభించింది. రవితేజ, శ్రీ దీప్తిల కుమారుడు ఐదో తరగతి చదువుతున్నారు. ఈ అవార్డు పొందుటకు ఇంగ్లీష్, సైన్స్, సోషల్, మ్యాక్స్, ఆటపాటలు, క్రమశిక్షణ తోటి విద్యార్థులతో కలిసిమెలిసి ఉండటం ఉపాధ్యాయులు చెప్పినట్టు వినడం తదితర అన్ని అంశములు పాఠశాలలో పనిచేయు అందరూ సూచనలతో ఈ అవార్డును ఎన్నిక చేస్తారు. ఈ అవార్డు అమెరికా అధ్యక్షులు సంతకం చేసి సీలు వేసి పంపుతారు. హర్షిత్ సిపిఐ నాయకులు మోదుమూడి రామారావు కుమార్తె, శ్రీ దీప్తి కుమారుడు అవార్డు రావడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పలువురు ప్రముఖులు హర్షిత్ కి అభినందనలు తెలియజేశారు.

ఎన్డీఏ కూటమి విజయం పట్ల హర్షం

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ :ఎన్డీఏ కూటమి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు అని పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కార్యదర్శి, జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తప్పును తెలుసుకొని చారిత్రాత్మకమైన తీర్పును ఇచ్చారని, ఎన్ డి ఏ కూటమిలో గెలిచిన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు.

జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారని జనసేన పార్టీ పోటీ చేసిన 21 అసెంబ్లీ రెండు పార్లమెంట్ స్థానాలు గెలుచుకొని భారతదేశ చరిత్రలో 100% గెలుపును సొంతం చేసుకున్న పార్టీగా చరిత్ర లిఖించిందని తెలిపారు. జనసేన టిడిపి బిజెపి శ్రేణులకు సహకారం అందించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు మాట్లాడుతూ జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కార్యదర్శిగా మచిలీపట్నం పార్లమెంట్ మరియు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపుకు తనదైన శైలిలో పనిచేసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఇచ్చిన బాధ్యతను చాకచక్యంగా శాంతియుతంగా నెరవేర్చి పార్లమెంట్ మరియు ఏడు అసెంబ్లీ స్థానాల గెలుపుకు కృషి చేశారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇన్చార్జిలు పినిశెట్టి వేణు, గంపల కృష్ణ, బండికరుణాకర్, రామినాయుడు, పోతేపల్లి శివ, యువజన నాయకులు ప్రసాద్ రాం జ్యోతి,గణేశ్, యశ్వంత్,వివేక్, ఏసు,నాగేశ్వరరావు, జనసేన పార్టీ మండల,పట్టణనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యూ సెంచరీ పబ్లిక్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ యం వెంకట్ ఆయన స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రర్యావరణాన్ని కాపాడాలని, అలాగే తల్లి దండ్రుల తమ పిల్లలకు పర్యావరణంపై అవగాహన పెంచి వచ్చే తరానికి ఫలాలు పంచే విధంగా ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఒక మొక్క అయినా నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపరంజీ తదితర స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పర్యావరణ పరిరక్షణ చిత్రాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ హెూమ్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో చిన్నారులు పాల్గొని పర్యావరణాన్ని రక్షించాలని వేసిన చిత్రాలు విశేషంగా కట్టుకున్నాయి. అనంతరం చిన్నారులు తెలుగు, ఇంగ్లీష్, హిందీ మూడు భాషల్లో పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్యామ్ జాదూగర్, తేజశ్రీ, అన్నపూర్ణ, పాల్గొన్నారు.

కూరాకులరాజా ఆధ్వర్యంలో మండల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఎన్డీఏ కూటమి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలని కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఏలేశ్వరం రూరల్ మండల అధ్యక్షుడు కూరాకులరాజా ఆధ్వర్యంలో మండల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంకుమార్ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని వరుపుల సత్యప్రభను, కాకినాడ పార్లమెంటు అభ్యర్థి తంగేళ్ల ఉదయ శ్రీనివాసుని అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రతి కార్యకర్తకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాబోయే కాలంలో ప్రజా సమ స్యలను పరిష్కరించేవిధంగా ప్రజలలో మమేకమై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు, జిల్లా సైనిక్ సెల్ కన్వనర్ కర్రి ధర్మరాజు జిల్లా కోపరేటివ్ సెల్ వెలుగూరి హరేరామ్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల మణి కంఠ, బందారు సూరిబాబు, పతివాడ వెంకటేశ్వరరావు, గొడుగు నల్లబ్బా యి, మల్ల మురళీకృష్ణ, ఎలుగుబంటి సూరిబాబు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్తిపాడు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపర్నెంట్ కాంతారావు, ప్యానెల్ అడ్వకేట్ బొంగులూరు మధు బాబు, కోర్టు సిబ్బంది శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు లక్ష్మీకాంతం శుభాకాంక్షలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌కు జిల్లా మాజీ కలెక్టర్ బి లక్ష్మీకాంతం శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం మండలి బుద్ధప్రసాద్ నివాసానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన లక్ష్మీ కాంతం బుద్ధప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న బుద్ధప్రసాద్ అవనిగడ్డ నియోజకవర్గం నుండి 4 వ పర్యాయం శాసనసభ్యునిగా గెలుపొందడం అభినందనీయం అన్నారు. గతంలో బుద్ధప్రసాద్ శాసనసభ్యునిగా ఉన్న సమయంలో తాను కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పనిచేశానని నియోజకవర్గంలో బుద్ధప్రసాద్ ఆ సమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. అభివృద్ధి కాముకుడు, నిరంతర శ్రామికుడు అయిన మండలి బుద్ధప్రసాద్ గెలుపు నియోజకవర్గానికి శుభపరిణామం అని లక్ష్మీకాంతం అన్నారు.

రామలింగేశ్వరునికి అన్నాభిషేకం

విశాలాంధ్ర-కూచిపూడి : నాట్య క్షేత్రమైన కూచిపూడి అగ్రహారంలో మాస శివరాత్రి సందర్భంగా శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేతరామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శివయ్యకు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. ప్రతినెల బహుళ చతుర్దశికి నిర్వహించే అభిషేకాలలో భాగంగా వైశాఖ బహుళచతుర్దశి సందర్భంగా ప్రత్యేకంగా అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు (ఉయ్యూరు) చింతల పారామకృష్ణ పురోహితంలో అభిషేకాలు నిర్వహించారు. దేవాలయ అర్చకుడు పెనుమూడీసతీష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలను తిలకించడానికి పలువురు భక్తులు తరలివచ్చారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర - కాకినాడ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని లేని పక్షంలో రానున్న కాలంలో మానవ, జీవరాశులు మరింత ప్రమాదంలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు పర్యావరణ వేత్తలు తమ అభిప్రాయంలను వ్యక్తం చేశారు. బుధవారం కాకినాడ ప్రాంతంలోని కోరంగిలో ఉన్న మడ అడవిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ భరణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పర్యావరణ శాఖ, అటవీ శాఖలు ఎంతో కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి పర్యావరణంను ఆస్వాదించి ఏ విధంగా రక్షించుకోవాలో తెలుసుకోవాలని భరణి సూచించారు. పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నదులు వెళ్లి సముద్రంలో కలిసిన చోటనే మడ చెట్టు జీవిస్తుందని అందువల్ల మడ అడవులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఎక్కువగా కార్బన్ తీసుకొన ఆక్సిజన్ విడుదల చేసి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రకృతిని పరిరక్షించుకోవాలని చెట్టు, నీరు నిరంతరం కాపాడుకోవాలని బొలిశెట్టి కోరారు. ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. నేషనల్ ఎన్విరాన్మెంట్ డైరెక్టర్ చిలుకూరి రామ్ కుమార్ మాట్లాడుతూ కాకినాడలో కోన ప్రాంత ఏరియాలో పచ్చదనం తక్కువ ఉందని దానిపై దృష్టి పెట్టి అక్కడ పర్యావరణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పోర్ట్ ఆఫీ సర్ ధర్మశాస్త్ర, ఎస్డిఎఫ్ఓ టి అనూష, ఎఫ్ఆర్ఓ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, పెసింగి ఆదినారాయణ, పిల్లారిశెట్టి రాజేశ్వరి, దుగ్గన బాబ్జి, డాక్టర్ కిరణ్, ఆకుల శ్రీనివాస్, ఆట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాంలో మల్లాడి కృష్ణారావు 61వ జన్మదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - యానాం : యానాం ముద్దుబిడ్డ, మానవతావాది, ప్రియతమ నేత మల్లాడి కృష్ణారావు 61వ జన్మదినోత్సవ వేడుకలు యానాం మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో జూన్ 6 తేదీ అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. మల్లాడి కృష్ణారావు 35 సంవత్సరాల రాజకీయ చరిత్రలో యానం ప్రజాప్రతినిధిగా పుదుచ్చేరి శాసనసభలో మూడుసార్లు ఉత్తమ శాసనసభ్యునిగా, మూడుసార్లు క్యాబినెట్ మంత్రిగా, రెండుసార్లు కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రస్తుతం న్యూఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా యానాంకు ప్రత్యేకతను సంచరించుకునేలా అభివృద్ధి పరచడమే గాక ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా సేవలందించిన నాయకులు నిస్వార్ధ సేవ మూర్తి యానం అభివృద్ధి ప్రదాత మల్లాడి కృష్ణారావు 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని 61 వసంతంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంగా జూన్ 6వ తేదీ ఉదయం 9 గంటల నుండి బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుచే ఆశీర్వచన పూర్వక ప్రవచనము జరిపించబడును. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ముఖ్యమంత్రివర్యులు ఎన్ రంగస్వామిచే కేక్ కటింగ్ చేయనున్నారు. యానాం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించే నిరంతర కృషివళుడు, గత 35 సంవత్సరాలుగా వ్యక్తిగతంగాను, వ్యవస్థాపక అధ్యక్షులుగా వారు స్థాపించిన యానాం ఓల్డ్ ఏజ్ హెూమ్, బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్, చిన్నారుల ఆనంద నిలయం, బేబీ కేర్ సెంటర్, ఒక్క రూపాయికే భోజనం అందించే అన్నపూర్ణాలయం వంటి స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా అనాథలను, వయోవృద్ధులను ఆదరించడమే గాక పేదలకు విద్య, వైద్యం, టీబి/ఎయిడ్స్ రోగులకు పోషకాహారం, నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాల కొరకు హాజరయ్యే పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, కరోనా, వరదలు, భారీ వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలలో ప్రతి ఇంటికి మందులు, నిత్యావసర సరుకులు, భోజనం, మంచినీరు అందించి ఆదుకోవడంతో పాటు యానం మరియు పరిసర ప్రాంత అలా ప్రజలకు 28 రకాల అనేక ఉచిత సేవలందిస్తున్న నిస్వార్ధ సేవాపరుడు మల్లాడి కృష్ణారావుకు మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేదికను ఎర్ర గార్డెన్స్ యానంలో గురువారం ఉదయం 9 గంటల నుండి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలలో విశాఖపట్నం హైదరాబాద్ మరియు స్థానిక కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి సీఎం ఎన్ రంగస్వామి స్పీకర్, హెూమ్ మినిస్టర్, ఇతర మంత్రివర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు, ప్రముఖులు, విశిష్ట అతిథులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వేలాదిమందికి బట్టలు, బహుమతులు అందజేయనున్నారు. అనంతరం ఈ జన్మదినోత్సవ వేడుకకు విచ్చేసిన ప్రతి ఒక్కరు మల్లాడి అభిమాన సంఘం ఏర్పాటు చేసిన విందును స్వీకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా అందరిని సవినయంగా ఆహ్వానిస్తూ కోరడమైనది. ఈ సందర్భంగా బుధవారం సభా వేదికను, ఏర్పాట్లను పరిశీలించిన మల్లాడి కృష్ణారావు.



ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు సహకరించిన వారికి కలెక్టర్ నివాస్ ధన్యవాదాలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో ఆది నుంచి చివరి వరకు భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె నివాస్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సాధారణ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ అంతా అందరికి సహకారంతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసామన్నారు. మే 13న జరిగిన పోలింగ్ ప్రక్రియ, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది ఎంతో అంకితభావం, నిబద్దతతో వ్యవహరిస్తూ విధులు సక్రమంగా నిర్వర్తించారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో జిల్లాలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన జిల్లా పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన రాజకీయ పక్షాల ప్రతినిధులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశలోను ఆయా అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించారని కలెక్టర్ కొనియాడారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియతో పాటు ఈసీఐ నూతనంగా ప్రవేశ పెట్టిన హెూం ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం వివిధ బృందాలకు, ఎన్నికల ప్రక్రియలో అన్ని విధాలా సహకరించిన జిల్లా ప్రజలకు, రెవిన్యూ శాఖాధికారులు, సిబ్బంది, జిల్లా అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, ఏఆర్ఓలు, సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఈఆర్ వోలు, అన్ని రకాల నిఘా స్క్వాడ్‌లు, సెక్టార్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పారిశుద్ధ్య సిబ్బంది, డ్రైవర్లు, జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ అన్ని శాఖల అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, యంపిడివోలకు జిల్లా కలెక్టర్ హృదయపూర్వకం అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు.

సజావుగా కౌంటింగ్ : ఎస్పీ

విశాలాంధ్రబ్యూరో, మచిలీపట్నం : సజావుగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేసిన పోలింగ్, కౌంటింగ్, కీలక బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి, కేంద్ర రాష్ట్ర బలగాలు, ఇతర శాఖల అధికారులకు కృష్ణా జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక అభినందనలు అని కృష్ణాజిల్లాఎస్పీ అదన అశ్వి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు- 2024 ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటినుండి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా, ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తూ, వారిలో అవగాహన పెంపొందిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించబడేలా, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా కృషిచేసిన జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి, కేంద్ర సాయుధ బలగాలకు ప్రత్యేకం గా అభినందనలు తెలియజేస్తున్నానని,పోలింగ్ ప్రక్రియతో పాటు కౌంటింగ్ ప్రక్రియ పూర్తవడానికి నిర్విరామంగా కృషి చేసి ప్రశాంత వాతావరణం లో ఎలాంటి హింసాత్మక చర్యలకు, గొడవలకు, అల్లర్లకు తావు లేకుండా ఎప్పటికప్పుడు ఇతర శాఖ అధికారులను సమన్వయ పరుచుకుంటూ, అనుమానితులపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తూ విజయవంతంగా ఎన్నికల ఫలితాలు విడుదల అయ్యేంతవరకు అహర్నిశలు కృషి చేసిన హెూంగార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరికి అభినందనలని అన్నారు. ప్రతి ఒక్కరూ విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించడం, సమయస్ఫూర్తిగా వారికి కేటాయించిన విధులు శక్తి వంచన లేకుండానిర్వహించడంవల్లే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలనుసజావుగా నిర్వహించగలిగామని తెలిపారు.

విద్యతో పాటు నైపుణ్యాలను వెలికితీయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యతో పాటు నైపుణ్యంలో తనకు ఉన్న ప్రతిభను వెలికితియాలని గ్రేడ్ 1 గ్రంథాలయ అధికారి జె ప్రభుదాసు అన్నారు. పౌర గ్రంథాలయ శాఖా సంచాలకుల ఉత్తర్వుల మేరకు గ్రంథాల యాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో విద్యార్థులకు బుధవారం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు పుస్తక పఠనం, భగవత్ గీతా, చిత్రలేఖనం, కథలు చెప్పడం, చదవడం, తెలుగు పద్యాలు, పాటలు పాడటం వాటిలో శిక్షణ ఇచ్చి చిత్రలేఖనం పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితియ, తృతీయ బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో భగవత్ గీత టీచర్ ఎం శేషగిరిరావు, తెలుగు ఉపాధ్యాయులు సి హెచ్ అయ్యప్ప, ఇంగ్లీష్ అధ్యాపకులు కె శ్రీకాంత్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు

ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు, పవన్ స్వాగతం పలికిన టీడీపీ నాయకులు



ఢిల్లీలో ఎన్డీఏ కూటమి సమావేశంలో పాల్గొనేందుకు తెలుగుదేశం జనసేన అధినేతలు చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్ళేందుకు గన్నవరం విమానాశ్రయానికి విచ్చేసారు. వారికి ఎమ్మెల్యేలు గన్నవరం యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జిల్లా ఎమ్మెల్యేలు నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దొంతు చిన్న, గన్నవరం మాదాల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, పాలడుగు నాని, కొమ్మరాజు సుధీర్, జాస్తి ఫణి, మండవ లక్ష్మీ, గూడవల్లి నరసయ్య, కోనేరు సందీప్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోని కలెక్టరేట్లో గుడ్డ, నారతో చేసిన పర్యావరణహిత సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని అరికట్టాలన్నారు. గుడ్డ. నారతో చేసిన సంచులనే వాడాలన్నారు ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవన శైలి అలవర్చుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ ఢిల్లీ రావు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వి. శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, పీడీలు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్, డాక్టర్ కె ఆర్ జి శేషు కుమార్, డాక్టర్ నాగార్జున , ఎన్టీఆర్ జిల్లా యువజన శాఖ మేనేజర్స్ పాల్గొన్నారు.

కూటమి హామీల అమలుకు క్యాబినెట్ మంత్రిని నియమించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడనున్న 16వ నూతన ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో ప్రకటించిన 8పేజీల మ్యానిఫెస్టోలోని 98 అంశాలపై పౌర సంక్షేమ సంఘం ప్రత్యేక పరిశీలన నిర్వహించింది. అధో గతి చెందిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితులంటూ కాల హరణం చేసిన తెలంగాణ ప్రభుత్వం తరహాలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల హామీలను కార్యాచరణలోకి తెచ్చే విధంగా ముఖ్య మంత్రి ప్రమాణ స్వీకారనంతరం అమిత ఆశలు పెట్టు కున్న ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రక్రియను నిరంతరం చేపట్టాలన్నారు. ఇందుకోసం కేబినెట్ హెూదామంత్రి నిర్వహణ వుంచాలన్నారు. 164 స్థానాలతో కూటమి ప్రభుత్వ పగ్గాలు చేపట్టనున్నందున సంఖ్యాపరంగా 10% శాతం నిర్మాణాత్మక ప్రతిపక్షం ఏర్పడ నందున అధికార కూటమికి 60%శాతం ప్రతి పక్ష పార్టీకి 40% శాతం పౌర ఓటింగ్ షేర్ వచ్చి నందున ఆ 40 శాతం ప్రజలే ప్రతి పక్షం బాధ్యతలను బహిరంగ సమాజంలో తగిన పర్యవేక్షణ చేసుకుంటారన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షం లేనందున నిర్లక్ష్య ధోరణి లేకుండా హామీలను జవాబు దారీగా అమలు చేసేందుకు ప్రయత్నం చేసి ఆ 40 శాతం ప్రజల మన్ననలు కూడా పొందే విధంగా పాలన జరగాలని పౌరసంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణ రాజు ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. మ్యాని ఫెస్టోలోని 98 అంశాలను ప్రతి 6 నెలల కోసారి అఖిలపక్షవేదిక ద్వారా సమీక్ష చేపట్టి పౌర సంఘం కరపత్రం విడుదల చేస్తుందన్నారు. అమలు చేయాల్సిన హామీల జాబితాను విడుదల చేసారు.

మెగా డీఎస్సి నోటి ఫికేషన్ ప్రకటించి టీచర్ ఉద్యోగాలు భర్తీ, రు.4 వేల వంతున వితంతు వృద్ధాప్య పెన్షన్-2024 ఏప్రిల్ నుంచి పెంచుతా మన్న ఫించన్ లెక్కించి జూలై నెల ఫించన్‌తో కలిపి ఇవ్వాలని, బిసి, ఎస్‌సి, ఎస్టి ముస్లిం మైనారిటీలకు 50 సంవత్సరాల వయస్సు అర్హ తతో ఫెన్షన్లు మంజూరు. పూర్తివైకల్య దివ్యాంగులకు రూ.15 వేలు దివ్యాంగులకు రూ.6 వేలఫించన్. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.15 వేలు, మహిళా సంఘాలకు రు.10లక్షల వడ్డీ లేని రుణాలు, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, యువతకు 5 ఏళ్లలో 20 లక్షలు ఏటా 4 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు రు.3వేల భృతి, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, రైతుకు రూ.20 వేల పెట్టుబడి, వాలంటీర్లకు రు.10వేల వేతనం, పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం, విదేశీ విద్యా పథకం, చెత్త పన్ను రద్దు, అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్ సొమ్ములు ఇవ్వడం,

విలేఖరులకు ఉచిత నివాస స్థలం, జూనియర్ లాయర్లకు నెల రు.10వేలు, హిందూ ఎండోమెంట్ బోర్డు ఏర్పాటు, 50వేల ఆదాయ దేవాలయ అర్చకులకు రు.15వేలు, ఇతర అర్చకులకు రు.10 వేలు, ఎయిడెడ్ కాలేజి ప్రయివేట్ ఫీజు రీ ఎంబర్స్ మెంట్, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, పెట్రోల్, డీజిల్, మద్యం, విద్యుత్ ధరల నియంత్రణ, ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్య భీమా, బిపి, షుగర్ వంటి నాన్ కమ్యూనిటీ వ్యాధులకు ఉచితంగా మందులు, సహజ మరణానికి రు.5లక్షలు, ప్రమాద మరణానికి రు.10 లక్షల భీమా, డ్రైవర్ల వాహనాలకు 5 శాతం పైబడిన వడ్డీ సబ్సిడీతో రు.4లక్షల రుణాలు, బ్యాడ్జీ కలిగిన ఆటో, ట్యాక్సీ, హెవీ లైసెన్స్ కలిగిన లారీ టిప్పర్ డ్రైవర్లకు ఏటా రు.15 వేలు, వాహనాల పై గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు, అసంఘటిత కార్మికులకు భీమా, భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు, వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు, రైతు కూలీలకు కార్పొరే షన్, ప్రతి పార్లమెంట్ పరిధిలో వెయ్యి ఎకరాల సేంద్రీయవ్యవసాయం, డ్రిప్ ఇరిగేషన్‌కు 90% శాతం సబ్సిడీ, క్రిష్టియన్ మిషనరీస్ ప్రాపర్టీస్ డెవలప్మెంట్ బోర్డు, చర్చిల నిర్మాణ పునరుద్దరణకు ఆర్థిక సహాయం, క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాలు, ఈద్గా ఖబరిస్తాన్‌లకు స్థలాలు, హాజ్ హౌస్ నిర్మాణం, నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు వెయ్యికోట్ల నిధులు, ఇమామ్‌లకు ప్రతి నెల రు.10 వేలు, మౌజన్‌లకు నెల రు.5 వేలు, మసీదుల నిర్వహణకు ప్రతి నెల రు.5 వేలు, హజ్ యాత్రకు లక్ష రూపాయలు, జిల్లాల వారీగా ఎస్‌సి వర్గీకరణ, సబ్ ప్లాన్ నిధులతో ఎస్‌సి, ఎస్‌టి ప్రాంతాల అభివృద్ధి, ఏజెన్సీలో ఆదివాసీ ఉపాధ్యాయ నియామకం, ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ, పేదల గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం, పట్టాలున్న వారికి ప్రభుత్వపక్కా ఇండ్ల నిర్మాణం, ఎక్స్ సర్వీస్ మెన్ సంక్షేమ కార్పోరేషన్, చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు, కాపుల సంక్షేమానికి 5 ఏళ్లలో రు.15 వేల కోట్లు, గోకులాలు గోపాల మిత్రల నియా మకం, సిపిఎస్, జిపిఎస్ పరిష్కారం, పిఆర్‌సి అలవెన్స్ ఐఆర్ అమలు, ఒకటో తారీఖున జీతాలు, పెన్షన్లు, ప్రభుత్వ ఉద్యోగుల ఫెన్షనర్స్ కార్పోరేషన్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కన్సా లిడేటెడ్ సిబ్బందికి ప్రభుత్వ పథకాల్లు, అంగన్ వాడీలకు గ్రాట్యుటీ, ఆశా వర్కర్లకు అదనపు వేతనం, ఉద్యోగాలు చేసే చోట మహిళలకు హాస్టల్, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు కానుకలు, పేద కుటుంబాలకు పెండ్లి కానుకలు, మత్స్యకారులకు సముద్ర వేట విరామ సమయంలో రు.20 వేలు, స్వర్ణకారుల కార్పోరేషన్ ఏర్పాటు, వడ్డెరకు క్వారీల్లో 15శాతం రిజర్వేషన్, చార్జీల్లో మినహాయింపు, గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయింపు, దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు రు.25 వేలు, సెలూన్‌లకు 200యూనిట్ల పవర్ లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్‌లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గొర్రెల పెంపకం యూనిట్లకు రాయితీ భీమా, శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు, దామాషాగా బిసి కార్పోరేషన్లకు నిధులు, బిసిల స్వయం ఉపాధికి రు.10వేల కోట్లు, తక్కువ జనాభా కలిగి ఎన్నికల్లో పోటీ చేయ లేక పోతున్న సామాజిక వర్గాలకు నామినేటెడ్ పోస్టులు, బిసి సబ్ ప్లాన్‌కు రు.లక్షన్నర కోట్లు, పంచాయితీలకు ఆర్థిక సంఘం నిధుల జమ, పంచా యితీ రాజ్ ప్రాజెక్ట్ ప్రతి పాదనలకు బడ్జెట్‌లో 10%శాతం నిధులు, సర్పంచ్, జెడ్పీ చైర్మన్ల గౌరవ వేతనాల పెంపు, ఇండస్ట్రియల్ క్లస్టర్‌గా ఆటో మొబైల్ హబ్‌గా హార్టీ కల్చర్ హబ్‌గా విత్తన రాజధానిగా మిషన్ రాయలసీమ, కర్నూలులో హైకోర్టు బెంచ్, విశాఖ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, కోటిపల్లి నరసాపురం రైల్వే నిర్మాణం, ప్రజా రాజధానిగా అమరావతి పునః నిర్మాణం, గ్రామ మండల జిల్లా రహదారులకు రోడ్లు, 5వేల టన్నుల కోల్డ్ స్టోరేజీలకు రు.1.50 కే యూనిట్ విద్యుత్, జీవో 117 రద్దుతో మూసేసిన ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధ రణ, గంజాయి, డ్రగ్స్, మాద ద్రవ్యాల నిర్మూలనకు 100 రోజుల్లో యాక్షన్ ప్లాన్, సామాన్యులకు ఉచిత ఇసుక వంటి అంశాలు మ్యానిఫెస్టోలో వున్నాయని పౌర సంఘం తెలియ జేసింది. ఈ హామీలకు మూడు రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ అవసరం అవుతుందని కేంద్రంలో భాగస్వామిగా వున్నందున ప్రత్యేక హెూదా విభజన హామీలు అదనంగా నిధులు ప్రత్యేక ప్యాకేజీ తీసుకు రాగలరన్న నమ్మకంతో ప్రజలున్నారన్నారు. వారి నమ్మకాన్ని కూటమి గెలిపించాలని కోరారు.